

'పుష్పా' వెనకున్నదెవరు?
ఓ సాధారణ డ్రైవర్‌గా ఉన్న వ్యక్తి డాన్‌గా ఎదగడంలో వెనుక ఉన్న అదృశ్య శక్తి పై అధికారులు ఆరా తీస్తున్నారు. - 8లో



మత్తుతో భవిష్యత్తు అంధకారం
ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. - 8లో



దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి
ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. - 8లో

న్యూస్‌రీల్

మాజీ సీఎంను కలిసిన నేతలు



అధినేతను కలిసిన మాజీ ఎమ్మెల్యే



వైఎస్ జగన్‌తో తలపుల పల్లి బాబురెడ్డి

పూతలపట్టు (యాదమరి) : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత వైఎస్ జగన్ నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లో ఎండగట్టాలని ప్రజాసమస్యలపై పోరాడాలని చెప్పారు. అక్రమ కేసులకు వెరవకుండా పార్టీ తరపున వారికి అండగా నిలవాలని సూచించినట్లు మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ చెప్పారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలను త్వరలోనే తప్పక కలుస్తానని వైఎస్ జగన్ హామీ ఇచ్చినట్లు చెప్పారు. అంతకు ముందు అక్రమ కేసులో అరెస్టయిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని విజయవాడలోని ఏసీబీ కోర్టులో కలిశారు. ఈ సందర్భంగా ఆయన యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నట్లు మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు.

16న జెడ్పీ సర్వసభ్య సమావేశం

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం 16న శనివారం నిర్వహించనున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ రవి కుమార్‌నాయుడు తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి కలెక్టర్, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు , జెడ్పీటీసీ, ఎంపీపీలు వస్తారన్నారు. అధికారులు సమాచారంతో రావాలని కోరారు.

ఆగని ఏనుగుల దాడులు



కోటపల్లెలో మామిడి కొమ్మలు విరిచేసిన ఏనుగులు

పులిచెర్ల(కల్లూరు) : వారం రోజులుగా ఏనుగుల దాడులు పంట పొలాలపై ఆగడంలేదు. మండలంలో రోజూ ఒకే చోట ఉండి రాత్రుల్లో పంటలను నాశనం చేస్తున్నాయి. పగటి పూట పొలాల సమీపంలోని చింతల వంకలో ఉంటూ రాత్రి సమీప గ్రామాల పంట పొలాలపై పడి నాశనం చేస్తున్నాయి. బుధవారం తెల్లవారు జామున పాళెం పంచాయతీ కోటపల్లె కల్లూరు సమీపం కట్టకిందపల్లెల రైతు పొలాల్లో మామిడి, కొబ్బరి చెట్లను విరిచేశాయి. ఎక్కువగా ఇవి కొబ్బరి చెట్లనే నాశనం చేస్తున్నాయి.

సంఘాల లెక్కలు పారదర్శకంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ శ్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్ : స్వయం సహాయక సంఘాల ఆర్థిక వ్యవహారాలు పారదర్శకంగా ఉండాలని డీఆర్డీఏ పీడీ శ్రీదేవి తెలిపారు. బుధవారం చిత్తూరులోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో సిబ్బందితో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘ సభ్యుల ఆర్థిక కార్యక్రమాలు ఇకపై సాంకేతపరంగా కొనసాగాలన్నారు. జిల్లాలో ప్రయోగాత్మకంగా యాదమరి, తవణంపల్లి మండలాల్లో ఎంపిక చేసిన వీఓలో తొలి విడతగా ఈ-నారి యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా సంబంధిత సంఘం సభ్యులు సంబంధించి ఆర్థిక వ్యవహారాలను యాప్‌లో పొందుపరచడం జరుగుతుందన్నారు. ఇప్పటికే మొబైల్ బ్యాంకింగ్ విధానం కొనసాగుతున్న నేపథ్యంలో సంఘం సభ్యులు సాంకేత పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే విధంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంలు సునీత ,రవికుమార్, ఏపీఎంల మధు, సుబ్బారెడ్డి, సీసీలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మీ భూమికి పడిగాపులు



'మీ భూమి' పోర్టల్ అన్నదాతలకు చుక్కలు చూపిస్తోంది. నెట్ సెంటర్ల వద్ద రోజుల తరబడి నిరీక్షిస్తున్నా అవసరమైన పత్రాలు పొందలేక సతమతం అవుతున్నారు. దీంతో సకాలంలో బ్యాంకుల్లో పత్రాలు ఇవ్వలేక రుణాలు పొందలేక అష్టకష్టాలు పడుతున్నారు. పోర్టల్ మొరాయిస్తుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పట్ల కక్ష సాధింపుతోనే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శలు గుప్పుమంటున్నాయి. మీ భూమి పోర్టల్‌ను పాత పద్ధతిలోనే అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పోర్టల్‌కు లాగిన్ కష్టాలు

- భూముల సమాచారానికి లాగిన్ తప్పనిసరి
- కూటమి ప్రభుత్వం వింత ధోరణి
- సమాచారం తెలుసుకునేందుకు రైతుల అవస్థలు
- మొరాయిస్తున్న 'మీ భూమి' పోర్టల్.. ఓపెన్ కాని భూ నక్షత్ర
- వెబ్‌ల్యాండ్‌లో సకాలంలో తెరుచుకోని భూముల వివరాలు
- ఇదే అదునుగా దోచేసుకుంటున్న మీ సేవా, నెట్ సెంటర్లు

- చిత్తూరు జిల్లాలో సీఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని మారప్ప అనే రైతుకు 3 ఎకరాల భూమి ఉంది. అందులోని అర్ధ ఎకరాను పక్కన ఉన్న మరో వ్యక్తి ఆక్రమించుకున్నాడు. దీంతో ఆందోళన చెందిన మారప్ప తనకు చెందిన భూమి వివరాలను మీ భూమి పోర్టల్‌లో పరిశీలించుకునేందుకు సచివాలయానికి వెళ్లాడు. సచివాలయంలో ఉన్న వీఆర్‌వో మారప్ప భూమికి చెందిన వివరాలను తెలుసుకునేందుకు మీ భూమి పోర్టల్ పనిచేయడం లేదని తిప్పి పంపించేశాడు. ఐదు రోజుల తర్వాత మారప్ప తిరిగీ మీ సేవా కేంద్రానికి వెళ్లి సమాచారం తెలుసుకుందామని వెళ్లాడు. అక్కడ కూడా అదే సమాధానం ఎదురైంది. ఇలా గత నెల 28వ తేదీ నుంచి మారప్ప మీ భూమి పోర్టల్ లో తన భూమి వివరాలు తెలుసుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నాడు.

- ఈ చిత్రంలో కనిపిస్తున్న భూమి తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం కందాడు పరిధిలోనిది. 2006లో భూ పంపిణీ పథకం కింద అదే మండలానికి చెందిన మహిళకు 5 ఎకరాలు కేటాయించారు. పదేళ్ల కిందట రెవెన్యూ అధికారులు భూమిని గుర్తించి సర్వే నంబర్ 246/పీ6, 7లో ఐదెకరాలు ఆమెకు అప్పగించారు. డీ నమూనా, పాసు పుస్తకాలు ఇచ్చారు. అదవిలా ఉన్న భూమిని అప్పు చేసి చదునుచేశారు. అయితే రెండు రోజుల క్రితం తనకు ఆ భూమిని రెవెన్యూ అధికారులు కేటాయించారంటూ తిరుపతికి చెందిన ఓ వ్యక్తి మరోసారి జేసీబీ పెట్టి చదునుచేశాడు. ఈ విషయం గురించి రెవెన్యూ అధికారులను వివరణ కోరితే.. 2024లో జేసీ చెప్పారని, ఇచ్చామని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఆ భూమికి సంబంధించి వివరాలు తెలుసుకోవాలని మీ భూమి పోర్టల్‌లో ప్రయత్నిస్తే ఎటువంటి వివరాలు కనిపించలేదు. గతంలో రెవెన్యూ అధికారులు సర్వే చేసి కేటాయించిన భూమినే ప్రస్తుతం ఉన్న రెవెన్యూ అధికారులు ఎలా చూపిస్తారని బాధితురాలు ప్రశ్నిస్తోంది.



గతంలో భూమిని చదును చేసిన దృశ్యం

- తిరుపతి జిల్లాలోని గూడూరు నియోజకవర్గంలో వెంకటప్ప అనే రైతుకు ఉన్న 5 ఎకరాల భూమిలో భూ తగాదాలు ఏర్పడ్డాయి. ఆ రైతు తన సమస్యను పరిష్కరించాలని గత నెల 29వ తేదీ గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అనంతరం మీ సేవా కేంద్రానికి వెళ్లి తన పేరుతో ఉన్న భూమి వివరాలను మీ భూమి పోర్టల్ లో పరిశీలించి చెప్పాలని సంప్రదించాడు. మీ భూమి పోర్టల్ లో భూ వివరాలు తెలుసుకోవాలంటే సెల్‌ఫోన్ కు ఓటీపీ వస్తుందని, అది చెబితేనే పోర్టల్ లో వివరాలు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని మీ సేవా ప్రతినిధి వెల్లడించారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ మోసాల పట్ల ఎక్కడ మోసం జరుగుతుందోనని భయపడిన రైతు వెంకటప్ప వివరాలు తెలుసుకోకుండానే వెనుదిరిగి వెళ్లిపోయాడు.

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెవెన్యూ సమస్యలను పరిష్కరించకపోగా కొత్త సమస్యలను సృష్టిస్తోంది. ఎన్నో సంవత్సరాలు సజావుగా రైతులకు ఇబ్బందులు లేకుండా కొనసాగుతున్న మీ భూమి, భూ నక్షత్ర పోర్టల్‌లో కూటమి ప్రభుత్వం మార్పులు తీసుకొచ్చింది. గత నెల రోజులుగా కూటమి ప్రభుత్వం మీ భూమి పోర్టల్ లో తెచ్చిన కొత్త మార్పులతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సజావుగా సాగుతున్న మీ భూమి పోర్టల్‌కు ఓటీపీ లాగిన్‌ను ఏర్పాటు చేయడంతో క్షేత్రస్థాయిలో సమస్యలు అధికమవుతున్నాయి. రైతులు, ప్రజలు తమ భూముల వివరాలను మీ భూమి పోర్టల్ లో తెలుసుకోలేక అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటున్నప్పటికీ తమ చేతుల్లో ఏమీ లేదంటూ చేతులెత్తేస్తున్నారు.

నెట్ స్పీడు లేకున్నా మొరాయింపే

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లో ఉన్న మండలాల్లో నెట్ వేగం అంతంత మాత్రమే. నగరాల్లో మాత్రమే 5 జీ నెట్‌వర్క్ అందుబాటులో ఉంటుంది. గ్రామాల్లో నెట్‌వర్క్ సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో ఇంటర్‌నెట్ సౌకర్యం అంతంత మాత్రంగానే ఉండే పరిస్థితి. ఈ క్రమంలో గ్రామాల్లో మీ భూమి వెబ్‌సైట్ లో వివరాలు పొందేందుకు రైతులు ఓటీపీ నమోదు చేశాకే వెబ్‌ల్యాండ్ ఓపెన్ అవుతోంది. నెట్ స్పీడు లేకపోయినా మీ భూమి పోర్టల్ ఓపెన్ అవ్వని పరిస్థితి క్షేత్రస్థాయిలో చోటు చేసుకుంటున్నాయి. గ్రామాల్లో మీ భూమి పోర్టల్ లో భూ వివరాలు పొందేందుకు రైతులు అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం మీ భూమి పోర్టల్‌కు లాగిన్ ఆప్షన్ పెట్టడంతోనే ఈ కొత్త కష్టాలు రైతులకు మొదలయ్యాయి.

పోర్టల్‌లో సమస్యలు

కూటమి ప్రభుత్వం మార్పులు చేసిన మీ భూమి పోర్టల్ లో వింత సమస్యలు ఎదురవుతున్నాయి. గత మీ భూమి పోర్టల్ ను పూర్తిగా తొలగించడంతో అందులోని సమగ్ర వివరాలు మాయమయ్యాయి. ప్రస్తుతం చాలా వరకు భూముల వివరాలు మీ భూమి పోర్టల్ లో కనిపించడం లేదు. ఈ సమస్యలు చిత్తూరు, తిరుపతి జిల్లాలు మొత్తం ఉన్నాయి. ఇదే సమయంలో పోర్టల్ మొరాయింపుతో రైతులకు అవసరమైన భూ పత్రాలు పొందలేక పోతున్నారు. రైతులు తమకు అవసరమైన పత్రాలు సకాలంలో బ్యాంకులలో ఇవ్వలేకపోతుండటంతో రుణాలు పొందలేక నష్టపోతున్నారు. రైతులు నెట్ సెంటర్ల వద్ద రోజంతా నిరీక్షిస్తున్నప్పటికీ తమకు అవసరమైన భూ పత్రాలను పొందలేకపోతున్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పట్ల కక్ష సాధింపుతోనే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శలు వెలువెత్తుతున్నాయి. మీ భూమి పోర్టల్ ను పాత పద్ధతిలోనే అమలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఓటీపీ లేకుంటే భూ వివరాలు రావంతే..

గతంలో భూములకు సంబంధించి 1బీ తీయాలన్నా.. అడంగల్ కావాలన్నా...ఎఫ్‌ఎంబీ అవసరం ఉన్నా ఆన్‌లైన్ సెంటర్‌కు వెళ్లి నిమిషాల్లో మీ భూమి పోర్టల్ లో పొందేందుకు అవకాశం ఉండేది. కూటమి ప్రభుత్వం పుణ్యాన ప్రస్తుతం వాటిని పొందడం అంత సులభం కాదు. మీ భూమి పోర్టల్‌ను ఓపెన్ చేయాలంటే ముందుగా ఫోన్ నంబర్ నమోదు చేయాలి. ఆ తరువాత క్యాప్చా వస్తుంది. అది ఎంటర్ చేసిన తర్వాత ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ ఎంటర్ చేస్తేనే వివరాలు ఓపెన్ అవుతాయి. ఈ తతంగం అంతా చేసేందుకు గంటల సమయం పడుతుంది. ఓటీపీ నమోదు చేసి వివరాలు నమోదు చేశాక ఓకే నొక్కితే సర్వర్ మొరాయిస్తూ సైట్ ఓపెన్ కాకుండా పోతోంది. మరో రెండు సార్లు తిరిగి అన్ని వివరాలు నమోదు చేసి ఓకే కొట్టిన తర్వాత సర్వర్ సమస్యే తలెత్తుతోంది. ఇలా మూడు సార్లు ఓటీపీ నమోదు చేశాక ఆ రోజుకి ఇక పై అవకాశం లేనట్టే. ఒకవేళ లాగిన్ అయిన సర్వర్ బీజీ వస్తుంది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

పాత పద్ధతినే అమలు చేయాలి



అసలే భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి. అంతే కాని రైతులపై కక్ష సాధింపునకు పాల్పడే విధంగా కొత్త నిర్ణయాలు అమలు చేయడం సబబు కాదు. మీ భూమి పోర్టల్ లో తెచ్చిన మార్పులపై క్షేత్రస్థాయిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో అవసరమైన భూ పత్రాలు పొందలేకపోతున్నారు. ఎందుకు ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు అమలు చేస్తున్నారో అర్థం కావడం లేదు. పాత పద్ధతిలోనే మీ భూమి పోర్టల్ ను కొనసాగించాలి.

– గోవర్ధన్, రైతు, చిత్తూరు జిల్లా

గతంలో ఇంటి వద్దే తెలుసుకునే అవకాశం

రైతులు భూ వివరాలను గతంలో ఇంటి వద్దే తెలుసుకునే వెసులుబాటు ఉండేది. ఫోన్‌లో కాని కంప్యూటర్‌లో కాని క్షణాల్లో తమకు అవసరమైన భూ వివరాలను తెలుసుకునే వారు. పబ్లిక్ డొమైన్‌లో ఇప్పటి వరకు ఈ ప్రక్రియ సులువుగా ఉండేది. రైతులు తమకు అవసరం వచ్చినప్పుడల్లా భూములకు సంబంధించిన 1బీ, అడంగల్, ఎఫ్‌ఎంబీలను తీసుకుని అవసరమైన కార్యక్రమాలను వాటిని వినియోగించుకునేవారు. అయితే ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు. భూ వివరాలను పొందుతున్న వారి వివరాలను షాడో రూపంలో తెలుసుకునేందుకు ప్రభుత్వం మీ భూమికి ఓటీపీ విధానం తీసుకొచ్చిందని ఆరోపణలు ఉన్నాయి.

అవసరమైన పత్రాలు పొందలేకపోతున్నా



నాకు 1బీ, ఎఫ్‌ఎంబీ పత్రాలు అవసరం పడ్డాయి. ఈ పత్రాల కోసం 20 రోజులుగా తిరుగుతున్నా. ప్రతి రోజు నెట్ సెంటర్ల వద్దకు వెళ్తున్నా. ప్రస్తుత ప్రభుత్వం మీ భూమి పోర్టల్‌కు ఓటీపీ విధానం అని కొత్తగా పెట్టిందంట. మొదట్లో ఆ ఓటీపీ చెప్పాలంటే భయమేసింది. తర్వాత చేసేదేమి లేక ఆ ఓటీపీ ని కూడా చెప్పాను. అయినప్పటికీ నాకు అవసరమైన భూ పత్రాలను పొందలేకపోయాను. సజావుగా సాగుతున్న మీ భూమి పోర్టల్ లో ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకుని రైతులను ఇబ్బందులు పెడుతున్నారు. పూర్వపు విధానమే అమలు చేయాలి.

– నాగభూషణం, రైతు, చిత్తూరు జిల్లా

వీరాంజనేయా.. కూటమికి మంచి బుద్ధి ప్రసాదించు



చౌడేపల్లె : కడియాలకుంట వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

– మిథున్‌రెడ్డి విడుదల కావాలని పూజలు

చౌడేపల్లె : వీరాంజనేయా.. కూటమి ప్రభుత్వానికి మంచి బుద్ధి ప్రసాదించయ్యా.. అంటూ మండలంలోని ఆమినిగుంట పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో కడియాలకుంట సమీపంలో వీరాంజనేయస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అక్రమ కేసులో అరెస్టయిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని కోరుతూ 101 టెంకాయలు కొట్టి మాజీ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం పేరిట అభిషేక పూజలు చేయించారు. మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా అక్రమ కేసు నుంచి బయటకు వస్తారని ఆకాంక్షించారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు దామోదరరాజు, పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, రవిచంద్రారెడ్డి, సర్పంచుల సంఘ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్ : అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం వలసపల్లెలో ఉండే జవహర్ నవోదయ పాఠశాలలో అడ్మిషన్లకు నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు గడువు పొడిగించారని ప్రిన్సిపల్ గీత బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో చదువుతున్న విద్యార్థులు జవహర్ నవోదయ పాఠశాలలో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఈ అడ్మిషన్లకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2026–27వ సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 27వ తేదీ వరకు గడువు పొడిగించారన్నారు.

కిక్కుకు పర్మిట్

- మద్యం దుకాణాల్లో పర్మిట్ గదులకు అనుమతి
- జిల్లాలో 113 మద్యం దుకాణాలకు పచ్చజెండా
- ప్రభుత్వానికి మరో రూ. 7 కోట్లు అ'ధనం'



కుప్పం : మద్యం దుకాణం పక్కనే వెలసిన పర్మిట్ గదికి అడ్డుగా ఉన్న రేకులు

చిత్తూరు అర్బన్ : ఇన్నాళ్లు తెరచాటు సాగుతున్న వ్యవహారానికి ఇప్పుడు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించింది. మద్యం దుకాణాల వద్ద.. మందు బాబులు మద్యం తాగడానికి పర్మిట్ గదులను ఏర్పాటు చేసుకునే వెలుసుబాటు కల్పిస్తూ కూటమి సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితంగా జిల్లాలోని 113 మద్యం దుకాణాల వద్ద అధికారికంగా పర్మిట్ గదులు నడపడానికి పచ్చజెండా ఊపింది.

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ప్రభుత్వ మద్యం దుకాణాలు మాత్రమే ఉండేవి. వీటి పనివేళలు సైతం ఉదయం 11 నుంచి రాత్రి 7 గంటల వరకే ముంగిచేవాళ్లు. ఎక్కడా కూడా మద్యం తాగడానికి పర్మిట్ గదులకు ఎలాంటి అనుమతులు లేవు. మహిళలు, కుటుంబాలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయం అప్పట్లో మంచి ఫలితాలనే ఇచ్చింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఉపాధిలేని తమ్ముళ్లకు లైసెన్సులు ఇస్తూ ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రైవేటు దుకాణాలను తీసుకొచ్చింది. జిల్లాలో అన్-రిజర్వుడు కింద 104, కల్లుగీత సామాజిక వర్గాలకు 9 దుకాణాలకు లైసెన్సులు ఇచ్చారు. దీంతో నెలకు జిల్లాలో దాదాపు రూ.120 కోట్లకు పైనే మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. వచ్చేనెల నుంచి పర్మిట్ గదులను అధికారికం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

రూ.7 కోట్ల ఆదాయం

తాజాగా విడుదలైన ఉత్తర్వుల మేరకు రూ.55 లక్షల లైసెన్సు ఫీజు ఉన్న మద్యం దుకాణాలకు ఏటా పర్మిట్ గదులు పెట్టుకోవడానికి రూ. లక్షలు, రూ.65 లక్షల ఫీజు ఉన్న చోట రూ. లక్షలుగా నిర్ణయించారు. ఈ లెక్కన రూ.55 లక్షల ఫీజులున్న దుకాణాలు జిల్లాలో 38 ఉంటే, పర్మిట్ గదుల ద్వారా రూ.2.09 కోట్లు, రూ.65 లక్షల ఫీజులున్న 75 మద్యం దుకాణాల నుంచి రూ.5 కోట్ల వరకు అదనపు ఆదాయం సమకూరనుంది.

మత్తుతో భవిష్యత్తు అంధకారం



పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పలు విద్యాసంస్థల్లో బుధవారం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ వినోద్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించినట్లు తెలిపారు. జిల్లాలోని కుప్పం ద్రవిడ యూనివర్శిటీ, చిత్తూరు జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను అవగాహన కల్పించినట్లు తెలిపారు.

పాలక మండలిలో 14 మందికి చోటు

చౌడేపల్లె : బోయకొండ దేవస్థానం పాలక మండలిలో ఎక్స్ అఫిషియో మెంబరుతో కలిపి మొత్తం 14 మందికి చోటు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ ఈఓ ఏకాంబరం బుధవారం తెలిపారు. పాలక మండలి ఏర్పాటులో ఆరుగురు మహిళలై ఉండాలన్నారు. ఆరుగురు ఓసీలలో ఒకరు బ్రాహ్మణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీలలో ఇద్దరు , బీసీలలో 5 గురు సభ్యులై ఉండి, వారిలో ఒకరు నాయీబ్రాహ్మణులై ఉండాలని తెలిపారు. దరఖాస్తుదారులు 30 ఏళ్లకు పైబడి హిందువులై ఉండాలన్నారు. నిర్ణీత గడువులోపు దేవాదాయశాఖ ఉప కమిషనర్ విడుదల చేసిన ఫార్మెట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఈఓ సూచించారు.

పోలీసు కస్టడీకి బ్యాంకు మేనేజర్

చిత్తూరు అర్బన్ : ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల గోల్‌మాల్ కేసులో యూనియన్ బ్యాంకు మేనేజరు మురళి అప్రైజర్ భాస్కర ఆచార్యను మూడు రోజులపాటు పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ చిత్తూరులోని మొదటి అదనపు మెజిస్ట్రేట్ మాధవి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. యాదమరిలోని యూనియన్ బ్యాంకులో ఖాతాదారులు బంగారు ఆభరణాలను తాకట్టుపెట్టి రుణాలు తీసుకునే వారు. అయితే ఇటీవల బ్యాంకు ఆడిట్ నిర్వహించగా అక్కడ ఉన్న బంగారు ఆభరణాలు స్థానంలో నకిలీ ఆభరణాలు తేలాయి. దీంతో ఉన్నతాధికారులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి బ్యాంకు మేనేజర్ మురళి అప్రైజర్ భాస్కర్‌ను ఇటీవల అరెస్టు చేశారు. వీరిని కస్టడీకి ఇస్తే కేసులో మరిన్ని వివరాలు రాబట్టాల్సి ఉందంటూ పోలీసులు న్యాయస్థానంలో పిటీషన్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి నిందితులకు మూడు రోజుల పాటు పోలీసుల కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లాలో చిరుజల్లులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లా వ్యాప్తంగా బుధవారం చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచే మేఘాలు కమ్ముకున్నాయి. అప్పటి నుంచి రాత్రి వరకు నిలకడలేకుండా చిరుజల్లులు కురుస్తున్నాయి. ఈ కురుస్తున్న వర్షాలకు వాతావరణం పూర్తిగా చల్లబడింది. చలి తీవ్రత పెరిగింది. వీటి కారణంగా విష జ్వరాలు పెరిగే అవకాశాలున్నాయని వైద్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

పుష్పా వెనకున్నదెవరు?

- కట్టిగేనహళ్లి ముఠాతో సంబంధాలపై ఆరా
- జేసీబీ డ్రైవర్ స్మగ్లర్‌గా అవతారం
- ఇసుక ట్రాక్టర్లలో దుంగల తరలింపు
- బైరెడ్డిపల్లి ఘటనలో నిందితుడిని తప్పించడంపై అనుమానాలు
- అటవీశాఖ ఈ చిక్కుముడులను విప్పేనా?



బైరెడ్డిపల్లి : ఆలపల్లి సమీపంలో పలమనేరు ఫారెస్ట్ అధికారులు పట్టుకున్న ఎర్ర దుంగలు(ఫైల్)

పలమనేరు : బైరెడ్డిపల్లి మండలం ఆలపల్లి కొత్తూరు సమీపంలోని దండుకుంట పొలాల వద్ద ఓ ఇంట్లో 144 ఎర్ర చందనం దుంగలను పలమనేరు ఫారెస్ట్ అధికారులు రెండు రోజుల కిందట సీజ్ చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా చెబుతున్న భాస్కర్‌రెడ్డి కర్ణాటకలోని బెంగళూరులో జేసీబీ డ్రైవర్‌గా ఉన్న వ్యక్తి ఎలా స్మగ్లర్‌గా మారాడన్నదే ఇప్పుడు పెద్ద చర్చనీయాంశమైంది. ఓ సాధారణ డ్రైవర్‌గా ఆపై జేసీబీ ఆపరేటర్‌గా ఉంటూ ఇంతటి డాన్‌గా మారడంతో ఆయన వెనుక ఎవరి హస్తం ఉందనే కోణంపై స్థానిక అటవీశాఖ విచారణ చేస్తోందని సమాచారం. ఎర్ర చందనం దుంగలున్నాయనే పక్కా సమాచారంతో వెళ్లిన ఫారెస్ట్ అధికారులు పక్కన ఉండి తన ప్రియురాలితో పరారైన భాస్కర్‌రెడ్డిని ఎందుకు పట్టుకోలేదనే విషయం ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తోంది.

సరుకు కట్టిగేనహళ్లికేనా...

తాజాగా దుంగలు పట్టుబడిన గ్రామం కర్ణాటక రాష్ట్రానికి కూత వేటు దూరంలో ఉంది. శేషాచలం నుంచి హొస్కోట సమీపంలోని కట్టిగేనహళ్లికి ఎన్నో ఏళ్లుగా చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి మీదుగానే ఎర్ర చందనం అక్రమ రవాణా అవుతోంది. ఈ నేపథ్యంలో ప్రధాన స్మగ్లర్లు ఏపీ సరిహద్దులోని ఆలపల్లి ప్రాంతాన్ని స్టాక్ పాయింట్ పెట్టుకున్నట్లు తెలుస్తోంది. హైవే నుంచి ఈ గ్రామం చాలా దగ్గర్లో ఉంది. ఇక్కడి నుంచి కర్ణాటకలోని చల్లహళ్లి, బైప్పళ్లి, కగ్గనహళ్లిల మీదుగా హైవేలో ఎలాంటి టోల్‌గేట్లు లేకుండా హొస్కోటకు అడ్డదారులున్నాయి. దీంతో ఇక్కడి నుంచి దుంగలను కర్ణాటకలోని కట్టిగేనహళ్లికి తరలిస్తున్నారనే సమాచారం.

స్మగ్లర్లకు ఆ గ్రామం అడ్డా

కొన్నేళ్లుగా శేషాచలం అడవుల నుంచి అక్రమంగా తరలుతున్న ఎర్ర చందనం కర్ణాటక రాష్ట్రంలోని హొస్కోట సమీపంలోని కట్టిగేనహళ్లికి చేరుతోంది. ఈ గ్రామం ఎర్ర చందనం స్మగ్లింగ్‌కు పేరు గాంచింది. ఆ గ్రామానికి చెందిన వసీంఖాన్, నదీంఖాన్ అంతర్జాతీయ ఎర్ర స్మగ్లర్లుగా పేరొందారు. వీరి అండతో ఆ గ్రామస్తులు రెండు దశాబ్దాలుగా ఎర్ర చందనం దుంగల అక్రమ రవాణాను వృత్తిగా చేసుకున్నారు. ఈ గ్రామంలో దాదాపు 20 మంది ఎర్ర స్మగర్లుండగా వీరిలో ఆరుగురు అంతర్జాతీయ ఎర్ర చందనం డాన్‌లు ఉన్నారు. ఈ గ్రామానికి కొత్త వ్యక్తులు వెళ్లి తిరిగీ రావడం అంత సులభం కాదు. ముఖ్యంగా ఖాకీ చొక్కా కనబడితే అంతే సంగతులు. ఒక్కో గ్యాంగ్‌లో వంద మంది దాకా ప్రైవేటు సైన్యాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామంలో అన్ని కుటుంబాల వారు ఇదే వృత్తిగా మార్చుకున్నారు. గ్రామ పొలిమేరల్లోని కోళ్లఫారాలు, వ్యవసాయ పొలాల వద్ద ఉన్న ఇళ్లనే ఎర్ర చందనం గోడౌన్లుగా మార్చేసుకున్నారు. ఇప్పటికే ఆ గ్రామానికి వెళ్లిన కన్నడ పోలీసులు, ఈ ప్రాంతం నుంచి వెళ్లిన పోలీసులపై గతంలో దాడులు కూడా జరిగాయి.

పట్టుబడిన దుంగలు ఏ–1 గ్రేడ్

పట్టుబడిన ఎర్ర చందనం దుంగలు ఏ–1 గ్రేడ్‌వని పలమనేరు సబ్ డీఎఫ్‌ఓ వేణుగోపాల్ మీడియాకు తెలిపారు. అత్యంత ధర పలికే ఈ దుంగలను జపాన్, చైనా దేశాలకు తరలిస్తారన్నారు. ఈ దుంగలు కట్టిగేనహళ్లిలో గ్రేడింగ్ చేశాక మంగళూరు సముద్ర తీరం నుంచి తీసుకెళ్లి అక్కడి నుంచి స్టీమర్ల ద్వారా తరలిస్తుంటారని తెలుస్తోంది. స్టీమర్లలోని ఖాళీ ప్రదేశాల్లో దుంగల నుంచి దుబాయ్‌కు తరలిస్తారని గతంలో పలమనేరు పోలీసులకు పట్టుబడ్డ నాజర్‌ఖాన్ తెలిపాడు. ఈ స్మగ్లింగ్‌లో కన్నడ పోలీసులతో పాటు, పోర్టు సిబ్బందితో పాటు సెంట్రల్, ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ సిబ్బంది కూడా భాగస్వామ్యులేనని గతంలో పోలీసుల విచారణలో తేలింది. ఏదేమైనా ఫారెస్ట్ అధికారులు ఈ కొత్త పుష్పాలు, కనిపించని పుష్పాలను ఎలా పట్టుకుంటారో కేసును ఎలా ఛేదిస్తారో వేచి చూడాల్సిందే. కాగా ఈ విషయమై స్థానిక సబ్ డీఎఫ్‌ఓ వేణుగోపాల్, ఎఫ్ఆర్వో నారాయణలను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఇసుక మాటున అక్రమ రవాణా

శేషాచలం అడవుల నుంచి సేకరించిన దుంగలను పలు మార్గాల ద్వారా ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్‌లలో ఇసుక చాటున తరలిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు రికార్డులు లేని కార్లను కూడా స్మగ్లింగ్‌కు వాడుకున్నట్లు సమాచారం. ఫ్రీ ఇసుక పాలసీ కావడంతో ఇసుక ట్రాక్టర్‌ను ఎవరూ ఆపడం లేదు. దీంతో ఎలాంటి అనుమానం రాకుండా స్మగర్లు ఇలా దుంగలను సరిహద్దులు దాటిస్తున్నట్లు సమాచారం. ఆలపల్లి వద్ద పొలాల వద్దనున్న ఇంటి వద్దకు కేవలం ఇసుక ట్రాక్టర్లు, కొన్ని కార్లు మాత్రమే వచ్చేవని స్థానికులు చెబుతున్నారు. దీన్ని బట్టి ఈ ఇసుక లోపలే దుంగలు ఇక్కడికి చేరుతున్నట్లు తెలుస్తోంది.

ప్రధాన స్మగ్లర్ ఉడాయింపుపై అనుమానాలు

ఆలపల్లి సమీపంలోని దండుకుంట వద్ద ఓ ఇంట్లో ఎర్ర చందనం దుంగలున్నాయని స్థానిక ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందింది. సోమవారం మధ్యాహ్నం అక్కడికి అధికారులు చేరుకున్నారు. ఇంటిపై దాడిచేసి అక్కడి దుంగలను స్వాధీనం చేసుకుంటుండగానే అక్కడే నిందితుడు భాస్కర్‌రెడ్డి ఉన్నాడని సమాచారం. అధికారులను చూసిన నిందితుడు పొలంలో ఉన్న తన ప్రియురాలికి కాల్ చేసి పక్కనే ఆపి ఉన్న కారు వద్దకు రమ్మని దాంట్లో ఇద్దరూ ఉడాయించారు. అయితే వీరిని ఫారెస్ట్ అధికారులు ఎందుకు పట్టుకోలేదనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

ఉప ఎన్నికల్లో కూటమి అరాచకాలు



మాట్లాడుతున్న పీఎన్ నాగరాజు

వి.కోట : కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్టలో జరిగిన జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి నేతల అరాచకాలు మిన్నంటాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎన్ నాగరాజు ఆరోపించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు నిర్వహించిన ఒక్క పోలింగ్ బూత్‌లోనూ వైఎస్సార్ సీపీ ఏజెంట్ లేకుండా పోలీసులు వ్యవహరించడం దారుణమన్నారు. బయటి ప్రాంతాల వారు యథేచ్ఛగా దొంగ ఓట్లు వేస్తున్నా పోలీసులు అడ్డుకోకపోవడం సరికాదన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే ప్రజలు ఓట్లు వేయడానికి వెళ్లకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. ఇంతటి దారుణమైన ఎన్నికలు ఎన్నడూ చూడలేదన్నారు. ఈ ఎన్నికను రద్దు చేసి కేంద్ర బలగాల నడుమ రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

పక్షవాతానికి మందు ఇస్తానని మోసం

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : పక్షవాతానికి మందు ఇస్తానని చెప్పి ఓ గుర్తు తెలియని వ్యక్తి మోసం చేశాడని బుధవారం తాలూకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. చిత్తూరు నగరం మురకంబట్టులోని ఇందిరమ్మ కాలనీకి చెందిన నాగమ్మ భర్త కొన్నాళ్లుగా కాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. నల్ల సంచితో ఇంటి వద్దకు వచ్చిన ఓ గుర్తు తెలియని వ్యక్తి నాగమ్మను పలకరించి ఆమె ద్వారా భర్తకు కాళ్ల నొప్పి సమస్య ఉందని తెలుసుకున్నాడు. తాను పక్షవాతానికి మందు ఇస్తానని నొప్పులు నయం అయిన తర్వాత ఆలయానికి దానం చేయమని నాగమ్మను గుర్తుతెలియని వ్యక్తి నమ్మించాడు. కొబ్బరి నూనె తీసుకురమ్మని చెప్పి.. సంచిలోని పదార్థాలను తీసి నూనెలో కలిపాడు. తొందరగా నయమవుతుందని ఆమెను పూర్తిగా నమ్మేలా చేశాడు. ఆతర్వాత బంగారు ఆభరణాలను అడిగాడు. ఇంటికెళ్లి పూజ చేసి ఇస్తామని చెప్పి వెళ్లిపోయాడు. తిరిగీ రాకపోయేసరికి మోసపోయామని తెలుసుకున్న నాగమ్మ తాలూకా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. రూ. 80 వేలు విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను మోసగిచ్చినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేశాభివృద్ధిలో భాగస్వాములుకావాలి



జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా ర్యాలీ

చిత్తూరు కలెక్టరేట్ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గాంధీ సర్కిల్ నుంచి ఎంఎస్ఆర్ సర్కిల్ మీదుగా నాగయ్య కళాక్షేత్రం వరకు చేపట్టారు. ఈ మేరకు కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు ప్రతి గ్రామం, ప్రతి జిల్లాలో రెండు వారాల పాటు స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించాలన్నారు. ఈ వేడుకల్లో ప్రతి ఒక్కరు జెండా పట్టుకుని తిరగడమే కాకుండా దేశభక్తిని చాటాలన్నారు. యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను పురస్కరించుకుని 2 వేల మంది విద్యార్థులతో మువ్వన్నెల జెండాతో ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈనెల 15 వ తేదీన పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ పతాకావిష్కరణ చేస్తారన్నారు.

డ్రగ్స్ సమాజానికి ప్రమాదకరం

సమాజంలో డ్రగ్స్ వాడకం పెరిగిందని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. డ్రగ్స్ సమాజానికి ప్రమాదకరంగా మారిందన్నారు. యువత జీవితాన్ని నాశనం చేసే డ్రగ్స్ కు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. మత్తుపదార్థాల రవాణా, అమ్మకం, వాడకం, తదితరులకు సంబంధించి సమాచారం తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ.. చిత్తూరు నియోజకవర్గాన్ని డ్రగ్ ఫ్రీ చిత్తూరుగా మార్చేందుకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, ఏఎస్పీ రాజశేఖర్, డీఈవో వరలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించేలా క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పలుశాఖల అధికారులతో వరుస సమావేశాలను నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం జరిగిన వెంటనే పోలీసు, రెవెన్యూ శాఖలతో పాటు అత్యవసర వైద్యసేవలకు అవసరమైన సమాచారం సిద్ధంగా పెట్టుకోవాలన్నారు. జిల్లాలోని బ్లాక్ స్పాట్స్‌లో దగ్గరలో ఉన్న ఆసుపత్రులు, డాక్టర్‌లు, అంబులెన్స్‌లు ఇతర ముఖ్యమైన సమాచారం సిద్ధం చేయాలన్నారు. అధికంగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు 451 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా 221 మంది మృతి చెందారన్నారు. ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల్లో స్పీడ్ బ్రేకర్‌లు, రంబుల్ స్టిక్, సోలార్ లైటింగ్, సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కేంద్రం నుంచి తిరుపతికి వెళ్లే వాహనదారులు సూచిక బోర్డులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమావేశంలో డీఎఫ్‌వో భరణి, ఆర్‌టీవో నిరంజన్‌రెడ్డి, డీఈవో వరలక్ష్మి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందుతున్నాయా?

జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజనులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని పరిశీలించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ లెవల్ మానిటరింగ్ (డిల్లీ బృందం) ఈ నెల 4వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించారన్నారు. సమావేశంలో బృందం సభ్యులు మణికందన్, ప్రశాంత్, జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, హౌసింగ్ పీడీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి



తవణంపల్లె రెవెన్యూ కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడేల్

తవణంపల్లె : అన్నదాత సుఖీభవ పథకంలో లోపాలను సరిదిద్ది రైతులకు న్యాయం చేయాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడేల్ సూచించారు. బుధవారం తవణంపల్లె రెవెన్యూ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. రెవెన్యూ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూశాఖ అధికారులతో అన్నదాత సుఖీభవ పథకంపై సమీక్షించారు. మండలంలోని ఎంత మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులు, ఎంత మంది రైతుల ఖాతాలకు నగదు జమ అయ్యింది అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈకేవైసీ, ఆధార్, సెల్ నంబరు లింకేజీ వివిధ కారణాలతో కొంత మంది రైతులకు అన్నదాత సుఖీభవ అందడంలేదన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది రైతులతో కలసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో వీఆర్‌ఓలు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 3,100 టన్నుల యూరియా నిల్వలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలో 3100 టన్నుల యూరియా నిల్వలు ఉన్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం వరకు జిల్లా వ్యాప్తంగా 3 వేల టన్నుల యూరియా నిల్వ ఉండిందన్నారు. కేరళ నుంచి 100 టన్నుల యూరియా బుధవారం సాయంత్రం జిల్లాకు చేరిందన్నారు. రైతులకు అవసరమైన మేర యూరియా అందజేస్తామని పేర్కొన్నారు.

గజాగుండం.. జలపరవశం



బంగారుపాళెం మండలం, పాలేరు పంచాయతీ, మోతకుంట సమీపంలోని గజాగుండ జలపాతం కనువిందు చేస్తోంది. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు జలపాతంలో నీరు జోరుగా ప్రవహిస్తోంది. పచ్చని కొండల మధ్య జలపరవళ్లతో ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తోంది. – బంగారుపాళెం

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం రాత్రి వరకు 77,596 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 31,565 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.73 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశిత సమయానికే క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వస్తే క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

బస్సు, టెంపో ఢీ

– డ్రైవర్ దుర్మరణం



మృతి చెందిన టెంపో డ్రైవర్ మునిరాజు



ప్రమాద స్థలంలో టెంపో, బస్సు

కుప్పం రూరల్ : ఎదురుగా వస్తున్న బస్సు – టెంపో ఢీకొని టెంపో డ్రైవర్ మృతి చెందిన సంఘటన కుప్పం మండలం, నడుమూరు అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. కుప్పం పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. కుప్పం వైపు నుంచి కోళ్లను వేసుకుని వెళ్తున్న లారీ, తమిళనాడు నుంచి అటుగా వస్తున్న తమిళనాడు ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి కుప్పం మండలం, నడుమూరు అటవీ ప్రాంతం వద్దకు రాగానే సరిహద్దు సమీపంలో ఢీకొన్నాయి. ప్రమాదంలో టెంపో డ్రైవర్ తమిళనాడుకు చెందిన మునిరాజు (35) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తమిళనాడు బస్సులోని డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతి చెందిన టెంపో డ్రైవర్‌ను పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. కాగా టెంపో డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.

అమ్మో.. ఏపీకే ఫైల్స్!

- వాట్సాప్‌లో వాటిని టచ్ చేస్తే ఫోన్ హ్యాకింగ్
- జాగ్రత్తగా ఉండాలంటున్న పోలీసులు

పలమనేరు: నేటి సమాజంలో మనిషి జీవితంలో సెల్‌ఫోన్ అత్యంత ముఖ్యంగా మారిపోయింది. ఏ మాత్రం ఖాళీ దొరికినా సెల్‌ఫోన్‌లో వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా, యూట్యూబ్‌లను చూస్తూ గడిపేస్తున్నారు. ఇదే అదునుగా హ్యాకర్లు సైతం వాట్సాప్‌లకు ఏపీకే ఫైల్స్‌ను పంపి వాటిని టచ్ చేయగానే ఫోన్ సెకండ్లలో హ్యాక్ చేస్తున్నారు. ఆపై మన ఫోనులోని సమాచారం కమాండ్ కంట్రోల్ మొత్తం హ్యాకర్ల చేతుల్లోకి వెళుతోంది. దీంతో మన ఫోన్‌లోని పాస్‌వర్డ్‌ల ఆధారంగా బ్యాంకు ఖాతాలోని మొత్తం నగదు ఖాళీ అవుతుంది. వ్యక్తిగత సమాచారాన్ని హరించే ఇలాంటి ఏపీకే మెసేజ్‌ల పట్ల సెల్ వినియోగదారులు చాలా జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ఇంతకీ ఏపీకే అంటే

ఏపీకే అంటే ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ అని అంటారు. ఇది యాప్ ప్రాజెక్ట్‌లో ప్రధానమైంది. దీని ద్వారా మన సెల్‌లోని వాట్సాప్‌కు పలు రకాల మెసేజ్‌లు నిత్యం వస్తూనే ఉంటాయి. వీటిని మనం టచ్ చేసిన వెంటనే మన ఫోన్‌లోని మొత్తం సమాచారం హ్యాకర్ల చేతిలోకి వెళ్లిపోతుంది. మనం దీన్ని సరిచేసుకునేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది.

ఎలా ఏమార్చుతారంటే!


మన సెల్‌లోని వాట్సాప్‌లో ఎన్నో గ్రూపులుంటాయి. వీటిల్లో హ్యాకర్లు చొరబడి ఉంటారు. ఏపీకే పేరిట మనల్ని ఏమార్చే ఆధార్ అప్‌డేట్ చేసుకోండని, ఎస్‌బీఐ ఈకేవైసీ చేసుకోవాలని, పీఎం కిసాన్ పడిందా లేదా చూడాలని ఇలా రకరకాలుగా వస్తుంటాయి. పొరబాటున ఏపీకే పై టచ్ చేశామో మనం ఫోన్‌కు పిచ్చిపట్టినట్టు మారిపోతుంది. మన ఫోన్‌ని హ్యాకర్లు విదేశాల నుంచి ఆపరేట్ చేయడం మొదలుపెడుతారు. మనం స్విచ్‌ఆఫ్ చేసినా ఇక లాభం లేదు. మన సమాచారం, బ్యాంకులకు సంబంధించిన ఫోన్‌పే, గుగూల్‌పేలాంటి పిన్‌లు వివరాలన్నీ వారి చేతుల్లోకి చేరిపోతాయి. మన ఫోన్ ద్వారా నగదును సులభంగా తస్కరించే అవకాశం ఉంటుంది.

ఇప్పటికే వేలాది మంది ఫోన్లు హ్యాక్

చిత్తూరు జిల్లాలోనే గత ఆరు నెలల్లో వేలాది మంది ఫోన్లు ఏపీకే ఫైల్ కారణంగా హ్యాక్‌కు గురయ్యాయి. ఫలితంగా లక్షలాది రూపాయలను హ్యాకర్లు చోరీ చేశారు. మోసం జరిగాక మనం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆపై పోగొట్టుకున్న నగదు తిరిగి రావడం చాలా కష్టమే.


ఏపీకే ఫైల్ ఇన్‌స్టాల్ అయ్యాక ఏం చేయాలంటే

- గూగుల్‌పే ప్రొటెక్ట్ ఆప్షన్ ట్యాప్ చేసి స్కాన్ చేయాలి
- హామ్‌ఫుల్ యాప్స్ కనిపిస్తే దాన్ని డిలీట్ చేయాలి
- సెట్టింగ్స్‌లో డివైజ్‌మై యాప్స్‌లో ఫైండ్ మై డివైజ్‌ను ఆన్ చేయాలి
- మొబైల్ డేటాను బ్యాకప్ చేసి రీస్టార్ట్ చేసి ఆపై కొత్త పాస్‌వర్డ్‌ను పెట్టుకోవాలి.



మొబైల్ హ్యాకర్స్ రిలేటెడ్ పిక్స్

చాలా జాగ్రత్తగా ఉండాలి



ఇటీవల వాట్సాప్ గ్రూపుల్లో మన అవసరాలను బట్టి రకరకాలుగా సేవల పేరిట ఏపీకే యాప్స్ వస్తున్నాయి. ఇవి మనకు ఉపయుక్తంగా ఉంటాయని వాటిపై టచ్‌చేస్తే ఇక అంతే సంగతులు. సమస్యలు తెచ్చుకుని ఇబ్బందులు పడేదానికంటే మనం తగిన జాగ్రత్తలు పాటిస్తే మంచిది. స్మార్ట్‌ఫోన్‌లో అన్ని రకాల సేఫ్టీ మెజర్స్‌ను పాటించాలి.

– డేరంగుల ప్రభాకర్, డీఎస్పీ, పలమనేరు